క్లుప్తంగా

భారత రాజ్యాంగ రక్షణే ధ్యేయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అశోక్

మీర్‌పేట: భీమ్ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యాలయాన్ని శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌లో సంస్థ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ కొంగరి అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పీ.వై.గిరి మహరాజ్ మాట్లాడుతూ.. బీ.ఆర్.అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా సంస్థను స్థాపించామని తెలిపారు. దీంతో పాటు భారత రాజ్యాంగ రక్షణే ప్రధాన లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కిరణ్ మహరాజ్, బబ్లూ, రాజు, వీ.కే.రాజు, లక్ష్మణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీకాంత్‌రెడ్డి



మహేశ్వరం: సబ్ రిజిస్ట్రార్‌గా జె శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నారాపల్లి నుంచి బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టగా, కార్యాలయ ఉద్యోగులతో పాటు డాక్యుమెంట్ రైటర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేసిన మధుసూదన్‌రెడ్డి హైదరాబాద్ డీఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

ఎమ్మెల్యే సబితారెడ్డికి క్షమాపణలు చెప్పాలి

మహిళా ప్రధాన కార్యదర్శి శ్రీలత యాదవ్

తుక్కుగూడ: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆమెకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ మహిళ ప్రధాన కార్యదర్శి పోలమోని శ్రీలత యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై అత్యాచారం, హత్యలు, దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని సీఎం, డిప్యూటీ సీఎం నిండు సభలో అవమానించడం బాధాకరమన్నారు. ఎవరికీ అధికారం శాశ్వతం కాదని, స్త్రీలను గౌరవించడం ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని హితవు పలికారు.

నియామకం



విజయలక్ష్మికి నియామక పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం కార్యదర్శిగా ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన విజయలక్ష్మిని నియమించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని ప్రాంతాల వాసులను కలుపుకొని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంఘాన్ని పటిష్టం చేయడానికి చర్యలు చేపడతామన్నారు. కల్పవల్లి, రాఘునందన్ ఉన్నారు.

ప్రార్థన మందిరానికి స్థలాన్ని కేటాయించండి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని సర్వే నంబర్ 247లోని 1.27 ఎకరాల వక్ఫ్ బోర్డు భూమిని ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండి.గౌస్ పాషా కోరారు. శుక్రవారం ఈ మేరకు సదరు భూమిలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమకు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డంపు చేసి.. దుర్గంధం పెంచి!

- డంపింగ్ యార్డుగా పెద్దచెరువు కట్ట పరిసరాలు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పెద్ద చెరువు కట్టపై డంప్ చేసిన చెత్తా చెదారం



కట్టపై పరిస్థితి

మీర్‌పేట: ఎన్నిసార్లు విన్నవించినా మీర్‌పేట మున్సిపల్ అధికారుల తీరులో మార్పు రావడం లేదు. అపరిశుభ్ర వాతావరణంతో పెద్ద చెరువు కట్ట నిండిందని అనేకసార్లు వినతిపత్రాలు అందించినా చలనం కరువైంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటన ఉన్న సమయంలో తప్ప మిగతా వేళలో చెత్తను తరలించడంలో శానిటేషన్ యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పెద్ద చెరువు కట్టతో పాటు శ్మశాన వాటిక, రైతుబజార్ పరిసర ప్రాంతమంతా చెత్తమయంగా మారిపోయిందని స్థానికులు వాపోతున్నారు. రోజువారీగా చెత్తను తరలించాల్సి ఉన్నప్పటికీ శానిటేషన్ అధికారుల పర్యవేక్షణ, సిబ్బంది నిర్లక్ష్యంతో చెరువు పరిసర ప్రాంతమంతా చెత్తా చెదారం, వ్యర్థాలతో దుర్గంధంగా తయారైందని, వాసనకు ముక్కుపుటలు అదురుతున్నాయని కాలనీ వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కట్టపై నుంచి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, దీంతో వ్యర్థాల కోసం కుక్కలు, పందులు అడ్డు రావడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఉదంతాలు అనేకం ఉన్నాయి.

తూతూ మంత్రంగా చర్యలు

చెరువు కట్ట పరిశుభ్రత విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే సిబ్బంది అప్పటికప్పుడు తూతూ మంత్రంగా చెత్తను తరలిస్తున్నారని, ఆ తరువాత మరుసటి రోజు నుంచి పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని పరిసర కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు కొన్నిసార్లు సిబ్బంది చెత్తను తరలించకుండా నిప్పుపెట్టి చేతులు దులుపుకొంటున్నారు. డంప్ చేసిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడం వల్ల అటు వాహనదారులకు, ఇటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే వారికి ఇబ్బందికరంగా ఉంటుంది. పెద్ద చెరువు చుట్టూ కట్టపై వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించి పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా రోజువారీగా చెత్తను తరలించేలా అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నక్ష బాటను కాపాడండి

తహసీల్దార్‌కు స్థానికుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొత్తూర్‌వాసులు

కందుకూరు: తమ గ్రామ నక్ష బాటను ఓ రియల్టర్ కబ్జా చేశాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కొత్తూర్ గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కొత్తూర్ రెవెన్యూలో సర్వే నంబర్లు 156, 157లో శ్రీశైలం రహదారి నుంచి మహేశ్వరానికి వెళ్లే నక్షబాటను రియల్టర్ జగదీష్‌చౌదరి ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశాడన్నారు. దీంతో రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా పోయిందన్నారు. నక్ష బాటను కబ్జాదారు నుంచి రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణగౌడ్, బాబుగౌడ్, యాదగిరి, ఎం.కృష్ణ, శేఖర్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

డీఈ రాజారామ్‌రెడ్డి



తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టులో వినియోగదారులతో మాట్లాడుతున్న డీఈ

మహేశ్వరం: ఫిర్యాదులు వచ్చిన వెంటనే విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నామని కందుకూరు విద్యుత్ డీఈ రాజారామ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టులో పర్యటించి వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నిరంతరాయంగా అందిస్తున్నామని తెలిపారు. విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలు తొలగించినప్పుడు, విద్యుత్ మరమ్మతులు చేస్తున్నప్పుడు మాత్రమే విద్యుత్ సరఫరాను ముందస్తు సమాచారం అందజేసి నిలిపివేస్తున్నామని తెలిపారు. వర్షకాలంలో విద్యుత్ స్తంభాలు, తీగలను తాకొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం విద్యుత్ ఏఈ చక్రపాణి, లైన్ ఇన్‌స్పెక్టర్ కుమార్ పలువురు లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

సీపీఎం ఆధ్వర్యంలో బాధితుల వినతి

కందుకూరు: ఇళ్ల సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులకు స్థలం చూపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్, కమిటీ సభ్యుడు అంకగళ్ల కుమార్ మాట్లాడుతూ.. 16 సంవత్సరాల క్రితం కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 778లో 200 మందికి 60 గజాల చొప్పున కేటాయించేలా ఇళ్ల సర్టిఫికెట్లు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వం మరోసారి కేసీఆర్ బొమ్మతో సర్టిఫికెట్లను ఇచ్చిందన్నారు. ఇంత వరకు స్థలాన్ని చూపలేదన్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయిస్తూ హద్దు రాళ్లు పాతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, గుడిసెల పోరాట సంఘం అధ్యక్షుడు ఆర్.శేఖర్, నేదునూరు మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, ఇంద్రమ్మ, యాదమ్మ, మంజుల, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ, ఎల్‌బీనగర్, పోస్టాఫీసు, యాదవనగర్, ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, వాంబేకాలనీ, గ్రీన్‌హిల్స్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకూ, హరిపురికాలనీ, రాక్‌హిల్స్, ఆటోనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రామకృష్ణ తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: వైట్ గోల్డ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇబ్రహీంపట్నం ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆక్టోఫస్, ఎస్ఎస్‌జీ, వైట్ గోల్డ్ ఇండస్ట్రీస్, వినోభానగర్, నాగన్‌పల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరిదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ పలు పూజలు నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. ఉదయం ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి

మంచాల: కేబినెట్ సబ్ కమిటీ 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచాలలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్య వ్యవస్థలో మార్పు కోసం కార్యక్రమాలు తీసుకోవడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులుకు బదిలీలు, పదోన్నతలు కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. 317 జీఓ కారణంగా నష్టపోయిన బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం కేబినేట్ సబ్ కమిటీ ముందుకు పోవాలన్నారు. ఈ జీఓ కారణంగా కుటుంబాలకు దూరంగా ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

ఆమనగల్లు: అర్హులైన రైతులు రైతుబీమా కోసం ఈనెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె, ఏఈఓ రాణి రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. కొత్తగా పట్టా పాసు పుస్తకాలు మంజూరైన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉద్యమ ఫలితమే ఎస్సీ వర్గీకరణ



మహేశ్వరం: కల్వకోల్‌లో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కందుకూరు: మోదీ, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మహేశ్వరం: మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బక్కని రవి మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీఆర్‌అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలనిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఉద్యమంలో అమరులైన మాదిగ అమరవీరులకు అంకితం ఇస్తున్నామని వారు పేర్కొన్నారు. కొండని లక్ష్మణ్ మాదిగ, గోవర్ధన్ మాదిగ, శంకరయ్య మాదిగ, మహేందర్ మాదిగ, అశోక్ మాదిగ, శేఖర్ మాదిగ, రాజు, చంద్రయ్య, బబ్లు,, శ్రీను, రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై హర్షం

కందుకూరు: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడంతో మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రభాకర్, బాబు, నాయకులు బాబురావు, మహేష్, తిరుమలేష్, పెంటయ్య, నరసింహ, సత్తయ్య, కిరణ్‌కుమార్, రమేష్, యాదగిరి, శ్రీశైలం, మల్లేష్, మహేందర్, గణేష్, సురేష్‌నాయక్, వెంకటేష్‌గౌడ్, నరసింహగౌడ్, పి.గణేష్, మైసమ్మ, రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేయర్ పారిజాత జన్మదిన వేడుకలు



మేయర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న అభిమానులు

బడంగ్‌పేట్: మేయర్ చిగురింత పారిజాతరెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు కార్పొరేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది, కమిషనర్, మహిళలు, పలు కాలనీలకు చెందిన వారు ఘనంగా నిర్వహించారు. శాలువ కప్పి కేక్ కట్ చేయించి వేడుకలు నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో యువజన కాంగ్రెస్ నాయకులు జెల్ల రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, వీరకర్ణారెడ్డి, బాలాపూర్ శివాలయ కమిటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, కమిషనర్ రఘుకుమార్, డీఈఈ జ్యోతి రెడ్డి, టీపీఓ లాలప్ప, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి

కల్లుగీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు యాదయ్య

మీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలు అమలు చేయాలని కల్లుగీత కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ముదేంటి యాదయ్య పేర్కొన్నారు. అమరుల యాదిలో గీతన్నల చైతన్యయాత్ర శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడకు చేరుకుంది. హక్కుల సాధనకు పోరాడి అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి పురస్కరించుకొని అన్ని మండల కేంద్రాలలో చేపడుతున్న చైతన్య యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సొసైటీలు ఏర్పాటు చేసుకోవడం, నౌకరి నామా లాంటి చట్టాలను రద్దు చేయించడం, ఎక్స్‌గ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి పెన్షన్ తదితర హక్కులు సాధించుకున్న చరిత్ర కల్లుగీత కార్మిక సంఘానిదని గుర్తుచేశారు. బొమ్మగాని ధర్మభిక్షం, బైరు మల్లయ్య, చిన్న మల్లయ్య, వంటి అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సుధాకర్‌గౌడ్, ఉయ్యాల రమేష్‌గౌడ్, ఎల్లయ్య గౌడ్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలను ముంపునకు గురి కానివ్వొద్దు



అభ్యుదయనగర్‌లో పర్యటిస్తున్న అధికారులు, కార్పొరేటర్ తదితరులు

వనస్థలిపురం: విజయవాడ జాతీయ రహదారి పనుల సందర్భంగా చింతలకుంట సమీపంలో రోడ్డు ఎత్తు పెరగడంతో అభ్యుదయనగర్, జనప్రియ హోమ్స్ కాలనీలు వర్షాకాలంలో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, వరద నీరు మళ్లింపునకు సంబంధిత అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్ అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఈఈ వెంకటేశ్వర్ రావు తదితర అధికారులతో కలిసి అభ్యుదయనగర్ వద్ద జరుగుతున్న జాతీయ రహదారి పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు గంగిరెడ్డి, పవన్‌కుమార్, పీవీఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ప్రశ్నించే గొంతును నొక్కలేరు



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రశ్నించే గొంతులను నొక్కలేరని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసి ఆమె దిష్టి బొమ్మలను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాసన సభలో మహిళను అగౌరపరచి వారి పార్టీ నాయకులతో మహిళల దిష్టిబొమ్మలను దహనం చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. అధికారంలో ఉండి మహిళా ఎమ్మెల్యేలను అవమానించడం తగదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై సబితా ఇంద్రారెడ్డి శాసనసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తున్నారన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పి అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. అసెంబ్లీలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తెలపాలని స్పీకర్‌ను అడిగితే నాలుగు గంటలు మైకు ఇవ్వకుండా నిలబెట్టడం దారుణమన్నారు. ఈ సమావేశంలో పెండ్యాల నగేష్, శ్రీనివాస్, అరవింద్‌కుమార్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్‌గౌడ్, అనురాధ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం: 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ రవీంద్రసాగర్ కోరారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కింద చెత్తాచెదారం తొలగించడం, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడం, మొక్కలు నాటడం, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టడం, మంచినీటి పంపిణీ సక్రమంగా జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

ఇబ్రహీంపట్నం రూరల్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలో చెత్తాచెదారం లేకుండా చేయలన్నారు. మొక్కలు నాటడం, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వార్డు కౌన్సిలర్లు, అధికారులు తప్పకుండా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, మున్సిపల్ ఇంజనీర్ వీరాంజనేయులు, మేనేజర్ రమేష్, వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు శిశువుకు శ్రేయస్కరం



కడ్తాల్: వారోత్సవాల ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు

తలకొండపల్లి: తల్లి పాలు శిశువుకు సంపూర్ణ పౌష్టికాహారం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల అన్నారు. తల్లి పాలతో బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్జాల్ అంగన్‌వాడీ కేంద్రం-2లో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తల్లి పాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో చురుకుగా ఉంటాడన్నారు. అదేవిధంగా మాదాయిపల్లిలో తల్లి పాల వారోత్సవాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు.

ఆరు నెలల వరకు అమ్మపాలు

కడ్తాల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ముద్వీన్ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ.. బిడ్డపుట్టిన గంటలోపే తల్లి పాలు ప్రారంభించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.